క్లుప్తంగా

పదో తరగతి మండల టాపర్‌కు సత్కారం



తులసిప్రియను సత్కరిస్తున్న ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి

ఏలేశ్వరం: పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన గంపా తులసిప్రియను పట్టణంలో ఎంఈఓ అబ్బాయి, ఎంఈఓ-2 వరలక్ష్మి మంగళవారం సత్కరించారు. తనకు మార్కులు తక్కువగా వేశారన్న ఉద్దేశంతో తులసిప్రియ రీవాల్యూషన్‌కు వెళ్లగా మరో మూడు మార్కులు పెరిగి 590 వచ్చాయని ఎంఈఓలు తెలిపారు. తులసిప్రియ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ టి.వీరవేణి, హెచ్‌ఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో ఆసనాలు వేస్తున్న చిన్నారులు

ఏలేశ్వరం: పట్టణ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.అప్పన్నబాబు విద్యార్థులకు యోగాపై శిక్షణనిచ్చారు. మరో ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు జనరల్ సైన్సు, జనరల్ అవేర్‌నెస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణనిస్తామన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకోవాలి



గెద్దనాపల్లి గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

కిర్లంపూడి: గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గెద్దనాపల్లి గ్రంథాలయాధికారి డి.శేఖర్ అన్నారు. మంగళవారం గెద్దనాపల్లి గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, బుక్ రీడింగ్, కథలు చెప్పడం వంటి వాటిపై తరగతులు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిక్షణ తరగతులకు పంపించాలని కోరారు.

మెట్టకు అనువైన వంగడాలను సాగు చేయండి



ఎన్.చామవరంలో ఖరీఫ్ ప్రణాళికపై రైతులతో చర్చిస్తున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యత ఆధారంగా ఖరీఫ్‌లో మెట్ట ప్రాంతానికి అనువైన వంగడాలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం తుని మండలం ఎన్.చామవరం, కుమ్మరిలోవ, రాజుపేట, చేపూరు, డి.పోలవరం, వెలమకొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగు ప్రణాళికపై రైతులతో చర్చించారు. ఎన్.చామవరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ అశోక్‌కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. అన్ని పంటలకు లోతైన దుక్కులు చేయాలన్నారు. పత్తిపంటలో అంతర పంటగా జనుము, అపరాలు, సజ్జలు సాగు చేయాలన్నారు. మెట్ట ప్రాంతానికి అనువైన ఎంటీయూ 1262 విత్తనాలను సాగు చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పి.జగ్గ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఏలేశ్వరం: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు 101వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దనాపల్లి గ్రామంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ, రాయుడు చిన్నా, కోరాడ కృష్ణ, సామంతుల గోపి, బుగతా శ్రీను, వాగురాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ.. ఆరోగ్య సంరక్షణ..

- అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైద్య సలహాలిస్తున్న ఆరోగ్య సిబ్బంది



అంగన్‌వాడీ కేంద్రంలో చార్టులతో చిన్నారులకు అక్షరాల బోధన

ప్రత్తిపాడు: అక్కడ చిన్నారులకు బొమ్మలు, చార్టుల సాయంతో బోధిస్తారు. కఠినమైన పదాలను ఆటపాటలతో పలికిస్తారు. తల్లి ప్రేమను పంచుతూ క్రమశిక్షణలో నడిపిస్తారు. విజ్ఞాన వికాసానికి నీతి కథలు చెబుతారు. అంతేకాదు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాటి నుంచీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించింది. నిత్యం చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులోనూ, శంఖవరం, రౌతులపూడి మండలాలు శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయి. ప్రత్తిపాడు ప్రాజెక్టులో 141 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 2,908 మంది విద్యార్థులు, 950 మంది బాలింతలు, 871 మంది గర్భిణులు, శంఖవరం ప్రాజెక్టులో 116 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 1,580 మంది విద్యార్థులు, 603 మంది గర్భిణులు, 644 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో ప్రేమగా మెలుగుతూ వారికి బొమ్మలతో అక్షర పరిచయం చేస్తున్నారు. విభిన్న పద్ధతులతో బోధిస్తున్నారు. చార్టుల ద్వారా కఠినమైన పదాలు పలికించి, వారికి చదువుపై ఆసక్తి పెంచి, బడికి వెళ్లేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. బరువు, ఎత్తు ఆధారంగా వైద్య సిబ్బంది సూచనలతో ఆరోగ్య గణన, రక్తహీనత తెలుసుకుని ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంగా ప్రతి నెలా కేజీ రాగి పిండి, అరకేజీ బెల్లం, అరకేజీ వేరుశెనగ అచ్చు, అరకేజీ ఎండు ఖర్జూరం, మూడు కేజీల బియ్యం, కేజీ పప్పు, అర లీటరు వంట నూనె, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు ఇస్తున్నారు.

అంగన్‌వాడీ మెనూ

సోమవారం: పప్పు, దోసకాయ, అన్నం, ఉడకబెట్టిన గుడ్డు, పాలు
మంగళవారం: పప్పు, టమాటా, పులిహోర, ఉడకబెట్టిన గుడ్డు, పాలు
బుధవారం: పప్పు, ఆకుకూర, అన్నం, ఉడకబెట్టిన గుడ్డు, పాలు
గురువారం: సాంబారు, ఆకుకూర, అన్నం, ఉడకబెట్టిన గుడ్డు, పాలు.
శుక్రవారం: పప్పు, బీరకాయ, అన్నం, ఉడకబెట్టిన గుడ్డు, పాలు
శనివారం: కాయగూరల అన్నం, ఆకుకూర, సాంబారు, ఉడకబెట్టిన గుడ్డు, పాలు

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	ప్రీస్కూల్ విద్యార్థులు	7 నెలలు- 3 ఏళ్లలోపు పిల్లలు	బాలింతలు	గర్భిణులు
ప్రత్తిపాడు	82	1,686	2,375	498	456
ఏలేశ్వరం	59	1,222	2,318	452	415
శంఖవరం	57	782	1,660	328	298
రౌతులపూడి	59	798	1,604	316	305
మొత్తం	257	4,488	7,957	1,594	1,474

విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు



మా పాప రిషిత చిన్మయికి అంగన్‌వాడీలో క్రమశిక్షణ అలవాటు చేశారు. తోటి పిల్లలతో ఆనందంగా ఆడుకుంటోంది. విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించి, మందులు ఇస్తున్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. – మొల్లు దుర్గాదేవి, జడ్డంగి అన్నవరం, ఏలేశ్వరం మండలం

కేంద్రాల నిర్వహణ బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుంది. మా బాబు జశ్వంత్‌కు, నాకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలు నేర్పిస్తూ వారికి వినూత్న రీతిలో పాఠాలు చెబుతుండడం చాలా బాగుంది. – బీబీ భువనేశ్వరి, ప్రత్తిపాడు, ప్రత్తిపాడు మండలం

భానుడి భగ భగ



తేటగుంట సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

తుని రూరల్/తొండంగి: రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయంటారు. కొద్దిరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం తునిలో గరిష్టంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అధిక ఉష్ణోగ్రతలతో వేడిగాలులు, ఉక్కపోతను వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు సమయపాలన లేని విద్యుత్ కోతలతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ భానుడు భగ భగమంటుండడంతో రోడ్లపైకి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఈ సమయంలో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు తగ్గిపోతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను డ్రైవర్లు రహదారి పక్కన ఉంచి విశ్రాంతి తీసుకుంటున్నారు. వాతావరణం చల్లబడ్డాక తిరిగి తమ ప్రయాణం ప్రారంభిస్తున్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా చేపట్టాలి



ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ ఇస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు



శిక్షణా తరగతులకు హాజరైన ఓట్ల లెక్కింపు సిబ్బంది

ప్రత్తిపాడు: కాకినాడ జేఎన్‌టీయూకేలో వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా చేపట్టాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో ఓట్ల లెక్కింపు సిబ్బంది, సహాయకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు లోబడి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎటువంటి ఆరోపణలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. శాసనసభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 3 టేబుళ్లు, సర్వీసు ఓట్ల లెక్కింపునకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాస్టర్ ట్రైనీలు చుక్కల గణేష్, ఎం.రాజబాబు స్ట్రాంగ్ రూం నుంచి వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్‌లను కౌంటింగ్ హాలుకు తరలించడం, రౌండుల వారీగా డేటా నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి జె.శ్రీనివాస్, వీఎస్ఎన్ మూర్తి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు ఎస్.నరసింహరావు, వై.రంగారావు, రాజకుమారి, సీహెచ్ విద్యాపతి, డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



వాటర్ ట్యాంకు క్లీనింగ్ రికార్డును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఓహెచ్ఎస్ఆర్, జీఎస్ఎల్ఆర్ ట్యాంకులను మంగళవారం శుభ్రపరిచారు. బిళ్లనందూరు, ఇండుగపల్లి, టీజేనగరం, ఎస్సార్‌పేట గ్రామాల్లో జరిగిన ట్యాంకుల క్లీనింగ్ పనులను ఈఓపీఆర్డీ పరిశీలించారు. రెండు రోజులకోసారి పరీక్షించిన తరువాతే నీటిని విడుదల చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిబంధనల మేరకు ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో లీకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి నేరేళ్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు



నేరేళ్లమ్మ తల్లి

అన్నవరం: స్థానిక మెయిన్ రోడ్‌లో కొలువైన గ్రామదేవత నేరేళ్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 6వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు జరగనున్నాయి. అన్నవరం గ్రామదేవతగా భక్తులు కొలిచే నేరేళ్లమ్మ తల్లికి వందేళ్లకు పైబడిన చరిత్ర ఉంది. సత్యదేవుని ఆవిర్భావానికి ముందే అమ్మవారు అన్నవరంలో వెలిసినట్లు సత్యదేవుని ఆలయ చరిత్రలో ఉంది. గతంలో స్థానిక పెరిక కులస్థులు నేరేళ్లమ్మ వారి జాతర మహోత్సవాలు నిర్వహించేవారు. సుమారు 30 ఏళ్లుగా ఆలయాన్ని అన్నవరం దేవస్థానం తన అధీనంలోకి తీసుకుని నూతన ఆలయం నిర్మించడంతో బాటు ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది.

మల్లేపల్లిలో అన్న సమారాధన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి గ్రామంలో రహదారిని ఆనుకుని ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్న సమారాదన నిర్వహించారు. గ్రామస్తులతోపాటు ప్రయాణికులు, వాహనదారులు స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్న స్వీకరించారు.

నేటి నుంచి అమ్మవార్ల జాతర

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మీ, పోలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మోరంపూడి శ్రీరంగనాయకులు తెలిపారు. వైశాఖ మాసం షష్ఠిని పురస్కరించుకుని ఏటా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహిస్తామన్నారు. గురువారం నుంచి అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటారని చెప్పారు.

అడవి బిడ్డలకు సైన్సు ఆటలు

సామర్లకోట: పెద్దాపురం ఏ సిటీ సైన్స్ సెంటర్ నిర్వాహకులు అడవి బిడ్డలకు సైన్సు పాఠ్యాంశాలను ఆటలతో నేర్పించారు. ఈ మేరకు నిర్వాహకులు బుద్ధా శ్రీనివాసు మంగళవారం వివరాలను విలేకర్లకు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో శారదా విద్యానికేతన్ గిరిజన పాఠశాలలో పదో తరగతి, ఇంటర్, డిప్లమా, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఫన్ సైన్సు వర్కుషాపును సోమ, మంగళవారం నిర్వహించామన్నారు. సైన్సును చదువుతూ నేర్చుకోకుండా, చూస్తూ నేర్చుకోవడం వలన విద్యార్థులు విజ్ఞానరంగంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని ఆయన తెలిపారు. ఆమ్లాలు, క్షారాలు, గరిమ నాభి, ఘర్షణ, న్యూటన్ మూడో గమన విషయం, ధ్వని, కాంతి, మంటలతో ప్రయోగాలు వంటి ప్రయోగాలను గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం చిల్డ్రన్ క్లబ్ ఇన్‌చార్జిలు రమాప్రభ, క్రాంతికుమార్, శ్యామ్, గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు.

దారుల్లో ఇరుకాటం

- కత్తిపూడి సెంటర్‌లో ట్రాఫిక్ చిక్కులు
- విస్తరణతోనే సమస్యకు పరిష్కారం



కత్తిపూడి బస్టాండ్ సెంటర్‌లో వాహనాల రద్దీ



కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు

శంఖవరం: ప్రధాన రహదారే అయినా వెళ్లే మార్గం ఉండదు.. రోడ్డెక్కితే ముందు సాగే గమ్యం కనిపించదు.. ఐక్కచిక్కిన ఆ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ చిక్కులే.. ఇరుకు దారి, ఆపై రద్దీ వెరసి ప్రయాణికులకు నరకం కనిపిస్తుంది. ముఖ్యంగా గ్రామాల్లో ప్రధాన జంక్షల వద్ద ఈ సమస్య మరింత జఠిలమవుతోంది. ఇందులో ప్రధానమైంది శంఖవరం మండలం కత్తిపూడి నాలుగు కూడళ్ల జంక్షన్. ఇటు శంఖవరం వెళ్లే రోడ్డు, అటు కాకినాడ, మరోవైపు రాజమహేంద్రవరం, తుని వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఆటోలు, బైక్‌లు, చిరు వ్యాపారుల బండ్లు రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పాఠశాలలు, కళాశాలలు, వ్యాపారాలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యకలాపాల నిమిత్తం నిత్యం అనేక మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు ఇరుకుగా, రద్దీగా ఉండడంతో కనీసం నడిచేవారికీ కష్టంగా ఉంటుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎవరూ చొరవ చూపడం లేదని ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ మొదటికి వచ్చి..

ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గతంలో కత్తిపూడి మీదుగా వెళ్లే 216 రహదారి, 16 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికీ రోడ్డు విస్తరణ జరిగింది. కొద్దికాలం బాగానే ప్రయాణం సాగింది. అయితే మళ్లీ యథావిధిగా కొంతమంది ఆక్రమణలు చేపట్టడంతో రోడ్డు ఇరుకుగా మారింది. సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఇక్కడ రోడ్లను వెడల్పు చేయడంతో పాటు పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం ఏదో ఒక ప్రమాదం



కత్తిపూడి అనేక గ్రామాలకు ముఖ్య కూడలి. అనేక మంది ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. అంతేకాక నిత్యం ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు, పోలీసులు స్పందించాలి. – కొల్లు శ్రీను, జి.కొత్తపల్లి

రోడ్డుపైనే వాహనాలు



కత్తిపూడి ప్రధాన రహదారిపైనే అధిక సంఖ్యలో వాహనాలు నిలిపివేస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కూడళ్ల వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. రోడ్లు వెడల్పు చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. – మాదే శామ్యూల్‌రాజ్, నెల్లిపూడి

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



తొండంగి యూపీ స్కూల్ స్టాక్ పాయింట్‌కు చేరుకున్న పాఠ్య పుస్తకాలు

తొండంగి: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు మండలానికి చేరాయని మండల విద్యాశాఖాధికారి షేక్ బాబ్జి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 6,377 మంది విద్యార్థులకు అవసరమైన 12,883 పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్లకు చేరాయని చెప్పారు. విద్యాశాఖ సెంట్రల్ యూనిట్ నుంచి మరిన్ని పుస్తకాలు రెండు రోజులు రానున్నాయని వివరించారు. తొండంగి జెడ్పీ హైస్కూలు, యూపీ స్కూళ్లలో స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని పాఠశాలలు ప్రారంభించే సమయానికి ఆయా ప్రధానోపాధ్యాయులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ హుకుంపేట గ్రామశివారులో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి చేశామని ఎస్ఐ బి.వినయ్ ప్రతాప్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానికుల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా కోడి పందేలపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.500 నగదు, నాలుగు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా అష్టోత్తర శత నామ పూజ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పండితుడు వెంకటేశ్వరరావు, భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో పండితుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర కంచి పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ కనెక్షన్ల తొలగింపుపై ఆగ్రహం



విద్యుత్ కనెక్షన్ల తొలగింపుపై సిబ్బందిని నిలదీస్తున్న కాలనీవాసులు

కోటనందూరు: ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగించడంపై అల్లిపూడి ఎస్సీ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అల్లిపూడి ఎస్సీ కాలనీలో పర్యటించిన విద్యుత్ శాఖ సిబ్బంది రూ.10 వేలు విద్యుత్ బకాయి ఉన్న విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. బిల్లులు చెల్లిస్తే తిరిగి పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. 200 యూనిట్ల వరకూ రాయితీ ఉన్న నేపథ్యంలో గత 17 ఏళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఒకవేళ బకాయిలుంటే ముందస్తు సమాచారమిచ్చి కనెక్షన్లు తొలగించాలి తప్ప అర్థాంతరంగా ఎలా తీసేస్తారని ప్రశ్నించారు.

చెరువు మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల సీజ్

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రాతి చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.నాగరాజు తెలిపారు. చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఇరిగేషన్ ఏఈ వై.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేశామన్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అపర్ణాదేవికి ఆమ్రఫలాలంకరణ



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

గొల్లప్రోలు: వైశాఖ మాస బహుళ పంచమిని పురస్కరించుకుని మంగళవారం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి, అమ్మవారిని మామిడిపండ్లు, పుష్పమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామ కుంకమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.